సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 8 । జూన్ । 2025



పెళ్లి చేయలేదని యువకుడి ఆత్మహత్య
తల్లిదండ్రులు పెళ్లి చేయలేదని పెద్దమండ్యంకు చెందిన గంగాధర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. -10లో



ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలి
ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని ప్రజాసంఘాలు, వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 890 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

హార్సిలీహిల్స్‌పై విద్యుత్ సర్వీసులు తొలగింపు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉన్న భవనాలకు డిస్కం అధికారులు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లలో ఎనిమిదింటిని శనివారం తొలగించారు. డిస్కం ములకలచెరువు ఏడీ, కురబలకోట ఏఈ, లైన్‌మెన్‌లు హార్సిలీ హిల్స్ వచ్చారు. కొండపై ఓ ప్రైవేటు అతిథి గృహానికి చెందిన సర్వీసుల్లో రెండింటిని, మరో ప్రైవేటు అతిథి గృహానికి చెందిన రెండు సర్వీసుల్లో ఒకటిని, ఇంకో అతిథి గృహానికి చెందిన నాలుగు సర్వీసులు, ఒక గృహానికి చెందిన సర్వీసును తొలగించారు. ఈ విద్యుత్ సర్వీసులను తొలగించాలని రెవెన్యూ అధికారులు డిస్కం అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

మోహన నారసింహుడు



మోహినీ అవతారంలో గజవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

కలికిరి: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం రాత్రి నరసింహ స్వామి మోహని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు సర్వదర్శనం కలిప్పించారు. పల్లకీలో పురవీధులలో స్వామివారు విహరించారు. ఆవర రోజు ఉత్సవానికి సంబంధించి ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు ఉభయదారుగా వ్యవహరించి కైంకర్యాలను జరిపించారు.

బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్ గీత

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం వలసపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా ఎం. గీత బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట నవోదయ విద్యాలయ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో కర్నాటక రాష్ట్రం తుముకూరు, తెలంగాణలోని ఖమ్మం, నెల్లూరులలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఆమె మాట్లాడుతూ నవోదయ విద్యాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ ఏడాది పది, 12వతరగతుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

కడప కోటిరెడ్డి సర్కిల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 5315 మంది హాజరు కాగా 2266 మంది పాస్ అయ్యారని, ఉత్తీర్ణత 46 శాతంగా నమోదైందని ఆయన పేర్కొన్నారు. సెకండ్ ఇయర్‌లో 3836 మంది హాజరు కాగా 2384 మంది పాస్ అయ్యారని, ఉత్తీర్ణత 62 శాతం నమోదైందన్నారు. రాష్ట్రంలో ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ రెండింటిలో జిల్లా 15వ స్థానంలో నిలిచిందని వివరించారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రతం

కడప కల్చరల్: కడప నగరం కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో స్థానిక మహిళా భక్తులు మంగళగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(ఆవోపా) మహిళా విభాగం ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాదుకు చెందిన కొప్పరావూరి కోటేశ్వరరావు, అఖిల పావని దంపతుల పర్యవేక్షణలో ఆలయానికి లక్ష నాణ్యతగల పసుపు కొమ్ములను సేకరించి తీసుకురావడం విశేషం. భక్తిపూర్వకంగా కార్యక్రమాన్ని నిర్వహించినంతరం దాదాపు 400 మంది మహిళా భక్తులు లక్ష పసుపు కొమ్ముల గౌరీ వ్రతాన్ని నిర్వహించారు. సేకరించిన పసుపు కొమ్ములను రాసిగా పోసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలమాలలు అలంకరించారు. ఇటీవల కుంబాభిషేకం జరిగిన అనంతరం ఇంత పెద్ద కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి కావడంతో మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పసుపు కార్యక్రమం అనంతరం మహిళా భక్తులు ఒకరినొకరు మంగళ పూర్వకంగా వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. అమ్మవారి కరుణ, కృపలతో ఈ కార్యక్రమం జరగడం మహిళా భక్తులందరికీ శుభదాయకమంటూ ప్రార్థనలు నిర్వహించారు.

అధికార పార్టీలో కలవరం

- పొమ్మనకుండా పొగబెట్టి బయటికి పంపిన టీడీపీ అధిష్టానం
- మాజీ ఎంపీ పాలకొండ రాయుడు మృతి సందర్భంలోనూ పట్టించుకోని వైనం
- జిల్లాకు ముఖ్యమంత్రి వస్తున్నా సుగవాసి రాకుండా అవమానం
- రాజంపేట నుంచి పోటీ చేసినా. . ఇన్చార్జి ఇవ్వని టీడీపీ
- సుగవాసి బాలసుబ్రమణ్యం బాటలో మరికొంతమంది నేతలు



సుగవాసి బాలసుబ్రమణ్యం

సాక్షి రాయచోటి: 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీకి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా కలవరపెడుతోంది. అయితే అధికార పగ్గాలు చేపట్టి ఏడాది అవుతన్నా ఇప్పటికీ హామీలు అమలు చేయకపోవడం...ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన నేపథ్యంలో గడ్డుకాలం దాపురిస్తోంది. ప్రజల నుంచి ఒక వైపు తిరుగుబాటు అవుతుండగా, మరోవైపు అధికార పార్టీలో ఉండి కూడా రాజీనామా చేయడానికి సైతం నేతలు వెనుకంజ వేయడం లేదు. అన్నమయ్య జిల్లాలో మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబానికి మంచి పట్టు ఉంది. అంతేకాకుండా రాజకీయంగా పేరొందిన కుటుంబం కావడంతో టీడీపీ తరుపున రాజంపేట అసెంబ్లీ సీటును కట్టబెట్టారు. అయితే స్థానిక నాయకులు సహకరించకపోగా, టీడీపీలోని కొంతమంది వెన్నుపోటు పొడవడంతో పరాజయం పాలయ్యారు ఎన్నికల్లో భారీగా ఖర్చు పెట్టుకున్న సుగవాసికి..పరాజయం తర్వాత సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం, రాజంపేట ఇన్‌చార్జి ప్రకటన చేయకపోగా, పార్టీలో కరివేపాకులా వాడుకున్నారు. అధికారం ఉన్నా పట్టించుకోకపోవడంతో దాదాపు ఏడాది కాలంగా నలిగిపోతున్న జెడ్పీ మాజీ చైర్మన్, రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా చేయడం సంచలనంగా మారింది.

పట్టించుకోని అధిష్టానం

జిల్లాలోని రాజంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేసిఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యంను తర్వాత టీడీపీ అధిష్టానం పట్టించుకోలేదు. ఓడిపోయిన తర్వాత ఒకటి, రెండు సార్లు నేరుగా వెళ్లి పెద్దలను కలిసినా కూడా మరో వర్గాన్ని ప్రోత్సహించారే తప్ప సుగవాసిని పట్టించుకోలేదు. సుగవాసి ప్రత్యర్థి వర్గమైన జగన్‌మోహన్‌రాజును జిల్లా పార్లమెంట్ అధ్యక్షునిగా ప్రకటించారు. కానీ రాజంపేట నియోజకవర్గానికి మాత్రం ఇన్‌చార్జిని ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో అక్కడ ఏ కార్యక్రమాలు జరిగినా పోటాపోటీగా చేస్తూ సుగవాసిని దెబ్బతీసే ప్రక్రియకు తెరతీశారు. ఏదో ఒక రకంగా సుగవాసి బాలసుబ్రమణ్యంను పొమ్మనకుండానే పొగబెట్టి బయటికి వెళ్లేలా వ్యూహ రచన సాగింది. టీడీపీ అధిష్టానం కూడా తమ్ముళ్ల కొట్టుకుంటున్నా.. ఏడాది అయినా కూడా నేటికీ ఇన్‌చార్జిని ప్రకటించలేని పరిస్థితి నెలకొంది.

మంత్రిపై అవినీతి ఆరోపణలు సంధించిన సుగవాసి

జిల్లాలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 సెప్టెంబరు నెలలో నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సుగవాసి బాలసుబ్రమణ్యం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు గుప్పించారు. అక్రమాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని....అంతేకాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని బహిరంగంగా విమర్శించారు. ప్రత్యేకంగా సమావేశాలు పెడుతూ రాజంపేట, సండుపల్లె, ఒంటిమిట్టలో మంత్రిపై పెద్ద ఎత్తున విమర్శల వర్షంతో పాటు ఆరోపణలు చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. ఇలా మంత్రిపై పెద్ద ఎత్తున దుమారం లేపడంతో కూడా లోలోపల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసిప్రత్యర్థి అయిన జగన్‌మోహన్‌రాజును ప్రోత్సహిస్తూ వచ్చారని కార్యకర్తలుగా పేర్కొంటున్నారు. ఏది ఏమైనా టీడీపీలో సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా జిల్లాలో తీవ్ర అలజడి సృష్టిస్తోంది.

జిల్లా టీడీపీలో అసమ్మతి

జిల్లాలో కూటమి శ్రేణుల మధ్య పొసగడం లేదు. ప్రధానంగా టీడీపీలో అన్నిచోట్ల అసమ్మతి రాజుకుంటోంది. వర్గ విబేధాలతో నేతల మధ్య ఆధిపత్య పోరు తారా స్థాయికి చేరింది. ఎవరికి వారు తమ పట్టును నిరూపించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో అసంతృప్తితో రగిలిపోతున్న అనేకమంది తెలుగు తమ్ముళ్లు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అన్న ఆందోళన టీడీపీని వెంటాడుతోంది. సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామాతో మరికొంతమంది నేతలు ఈ బాటలోనే పయనించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అధికార పార్టీలో ఉన్నా..అవమానాలు

జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఉంటున్న సుగవాసి కుటుంబానికి జిల్లా వ్యాప్తంగా మంచి పట్టు ఉంది. ఇదే కోవలో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యం అడుగడుగునా అవమానాలు ఎదుర్కొంటూ వస్తున్నారు. టీడీపీ ఆయనను పొమ్మనకుండానే పొగబెట్టిందని కార్యకర్తలు మాట్లాడుకుంటున్నారు. పార్టీ కోసం మాజీ ఎంపీ కుటుంబం అహర్నిశలు కష్టపడినా ఇప్పుడు మాత్రం అధికారం ఉన్నా అవమానాలు తప్పలేదు. గత ఫిబ్రవరిలో సీఎం చంద్రబాబు సంబేపల్లె పర్యటనకు వచ్చిన సమయంలోనూ సుగవాసి బాలసుబ్రమణ్యంకు కలిసేందుకు అవకాశం ఇవ్వలేదు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సమయంలోనూ ముఖ్యమంత్రి రాజంపేట నియోజకవర్గానికి వచ్చినపుడు కూడా సుగవాసి కుటుంబాన్ని విస్మరించారు. మహానాడుకు టీడీపీ అధిష్టానం నుంచి పిలుపు లేకపోగా, జిల్లా పార్టీ నుంచి కేవలం సుగవాసి కుటుంబీకులైన ఇద్దరికి మాత్రమే పాసులు పంపించారని తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఇటీవల మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు మృతి చెందిన సమయంలో ఇన్‌చార్జి మంత్రిని పంపించి అధిష్టానం తరుపున పెద్దలు రాకుండా అవమానించారని లోలోన ఆ కుటుంబం మదన పడుతోంది. సుగవాసి పాలకొండ్రాయుడు మృతి చెందే వరకు టీడీపీలోనే ఉంటూ పార్టీని బలోపేతం చేశారు. మంత్రి, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేగా ఇలా అనేక హోదాల్లో పనిచేసిన సీనియర్ నాయకుడు మృతి చెందిన సమయంలో కూడా టీడీపీ అధిష్టానం పెద్దగా పట్టించుకోకపోగా...మృతి చెందిన తర్వాత వారం, పది రోజుల్లోనే జరిగిన మహానాడులో సైతం సుగవాసి ప్రస్తావన లేకపోవడం వారిలో ఆగ్రహానికి గురి చేస్తోంది.

అన్న రాజీనామా వ్యక్తిగతం

- సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి: టీడీపీ నేత సుగవాసి సుబ్రమణ్యం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడంపై ఆయన సోదరుడు ప్రసాద్ బాబు స్పందించారు. ఆయన రాజీనామా వ్యక్తిగతమని, తానుమాత్రం టీడీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.అన్న రాజీనామా విషయాన్ని తాను సోషల్ మీడియాలో చూశానని, రాజంపేటలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపట్ల విసుగుచెంది రాజీనామా చేసి ఉంటాడేమోనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజంపేట అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడ జరిగిన ద్రోహం, పార్టీ నాయకులు చేసిన మోసాలు కారణంగా ఓటమిపాలయ్యామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్టీ జిల్లా నాయకుల వ్యవహారం సరిగా లేకపోవడంతోనే ఈ పరిస్థితులు ఎదురై ఉంటాయన్నారు. రాజకీయంగా మా కుటుంబానికి అన్యాయం చేసిన వారికి రాబోయే రోజుల్లో రాజకీయంగానే గుణపాఠం చెబుతామన్నారు. 2012 నుంచి 2024 వరకు పార్టీ టికెట్లు ఇవ్వకపోయినా పార్టీ సూచించిన వారికి నిస్వార్థంతో పని చేశామన్నారు. మా తండ్రి వృద్ధాప్యంలో సైతం నిస్వార్థంగా ఎన్నికల్లో పనిచేస్తే ఎన్నికల అనంతరం మా కుటుంబంతో పాటు పార్టీ లోని సీనియర్ నాయకులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కుటుంబంలో చిచ్చు..

తెలుగుదేశం పార్టీకి సుగవాసి సుబ్రమణ్యం రాజీనామా చేయడంతో వారి కుటుంబంలో రాజకీయ చిచ్చురేపింది. పార్టీలో తండ్రి వారసత్వంగా సోదరులు సుబ్రమణ్యం, ప్రసాద్ బాబులు పనిచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాజంపేట అభ్యర్థిగా సుబ్రమణ్యం పోటీచేస్తే ఆయన తరపున ప్రసాద్ బాబు ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, తండ్రి మృతి చెందిన సమయంలో పార్టీ అధిష్టానం నేతలు రాకపోవడం, సరైన రీతిలో స్పందించకపోవడంతో సోదరులిద్దరు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుబ్రమణ్యం మాట మాత్రం ఆయన సోదరుడు ప్రసాద్ బాబుకు సమాచారం ఇవ్వకుండా రాజీనామా చేయడంపై వారి ఇరువురి మధ్య రాజకీయ పొరపొచ్చాలు మొదలైనట్లు సుగవాసి వర్గీయుల్లో చర్చ నడుస్తోంది.

మదనపల్లె : బెంగళూరురోడ్డులోని ఈద్గాలో ముస్లింల ప్రార్థన, ధార్మికోపన్యాసం చేస్తున్న మతగురువు మౌలానా ముఫ్తీ షోయబ్‌సాహెబ్





బి.కొత్తకోటలో...



త్యాగానికి ప్రతీక బక్రీద్



రాయచోటిలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



ప్రసంగిస్తున్న మతపెద్ద సర్మాజి

బక్రీద్ వేడుకలను జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, కోడూరు, తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రాలతో పాటు వాల్మీకిపురం, గుర్రంకొండ, చిట్వేలి, లక్కిరెడ్డిపల్లి, బి కొత్తకోట తదితర మండల కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోని ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ఖురాన్ లో చెప్పిన విషయాలను తూచా తప్పకుండా ప్రతీ ముస్లిం పాటించాలన్నారు. సోదరభావం, దానం, త్యాగం వంటి సుగుణాలను ఈ పండుగ ప్రతిబింబిస్తుందని, సమస్త మానవాళికి ఆదర్శనీయమని, ప్రజలందరూ ధనిక పేద తేడా లేకుండా పండుగ జరుపుకోవాలని సూచించారు. ప్రార్థనల అనంతరం చిన్నారులు, పెద్దలు పరస్పరం ఈద్-ముబారక్ చెప్పుకున్నారు. అనంతరం పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాజంపేటలో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, ఆయా ప్రాంతాల్లోని స్థానిక నాయకులు ప్రార్థనలలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో సామరస్య స్ఫూర్తి, దాతృత్వం వెల్లివిరిసింది.పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



పీలేరులో..

ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



జల జీవన్ మిషన్ పథకంపై కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు

రాయచోటి: కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారుల సూచనలను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహాయంతో చేపడుతున్న జల జీవన్ మిషన్ పథకంపై కేంద్ర ప్రభుత్వం ప్రతినిధులైన మీను శుక్ల పాఠక్, చీఫ్ ఇంజినీర్ ఎస్వీ శెట్టిలు గ్రామీణ నీటి సరఫరా శాఖ, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జలజీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా 3709 పనులు మంజూరయ్యాయని, ఇందులో 2225 పనులు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధదశల్లో ఉన్నాయని జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి ప్రసన్న కుమార్ వివరించారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని 44 మండలాల్లో 6967 నివాసాల్లో నివసిస్తున్న 31 లక్షల, 87వేల, 66 మందికి రెండు ఫేసులలో గండికోట, వెలిగల్లు రిజర్వాయర్ల ద్వారా కరువు ప్రాంతాలకు తాగునీటిని అందించడం కోసం 2370 కోట్ల రూపాయలతో ఏప్రిల్ 2025లో ప్రారంభించిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అక్టోబర్ 2027 కల్లా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టు మొదటి ఫేసులో పీలేరు, తంబళ్లపల్లి, రాయచోటిలోని 18 మండలాల్లో 241 గ్రామ పంచాయతీలకు నీటి సరఫరా అందిస్తామన్నారు. మొదటి ఫేసులో గండికోట రిజర్వాయర్ ద్వారా 1.683 టీఎంసీల నీటిని, వెలిగల్లు రిజర్వాయర్ ద్వారా 0.175 టీఎంసీ నీటిని కరువు ప్రాంతాలకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రసన్న కుమార్ కేంద్ర బృందానికి తెలియపరిచారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా భౌగోళిక స్వరూపం వల్ల వర్షపాతం తక్కువగా ఉంటుందన్నారు. భూగర్భజలాలు ప్రజలకు అందుబాటులో లేవని, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీటి సరఫరా అత్యంత అవసరమని కేంద్ర ప్రభుత్వ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న యల్లమ్మ

మదనపల్లె రూరల్ : అనారోగ్యంతో బాధపడుతూ, మనస్తాపం చెంది వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. విఠలం గ్రామానికి చెందిన నర్సింహులు భార్య యల్లమ్మ(65) కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. చికిత్స కోసం పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగింది. జబ్బు నయంకాకపోగా, పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు అవుతుండటంతో తీవ్రంగా మనస్తాపం చెందింది. శుక్రవారం ఇంటివద్ద విషపు గుళికలు తినింది. గమనించిన కుటుంబ సభ్యులు వాల్మీకిపురం కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. వాల్మీకిపురం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారు బోల్తా



కిరాణా షాపులోకి దూసుకెళ్లి బోల్తా పడిన కారు

సిద్దవటం : మండలంలోని కడప–చెన్నై ప్రధాన రహదారి, నిర్మలగిరి కాలనీ వద్ద శనివారం తెల్లవారు జామున కారు అదుపు తప్పి బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వారిని వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అన్నమయ్య జిల్లా నందలూరు గ్రామ వాసులు అనంతపురానికి ఓ శుభ కార్యానికి వెళ్లి తిరిగి నందలూరు గ్రామానికి కారులో వస్తుండగా సిద్దవటం మండలం నిర్మలగిరి కాలనీ వద్దకు రాగానే కారు టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి కారు రోడ్డు పక్కన ఉన్న కిరాణా షాపులోకి దూసుకెళ్లింది. దీంతో పెంచలయ్యకు చెందిన కిరాణా షాపు పాక్షికంగా దెబ్బతింది. కారులో నలుగురు పిల్లలు, ఐదుగురు పెద్దలు ప్రయాణిస్తున్నారు. వీరిలో రామక్రిష్ణయ్య, ప్రశాంతి, కళ్యాణి అనే ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా..

మదనపల్లె రూరల్ : ఆటో బోల్తా పడి 9 మంది గాయపడిన ఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని శానిటోరియం తురకపల్లెకు చెందిన కొంతమంది మదనపల్లెకు వచ్చి తిరిగి ఆటోలో వెళుతుండగా, తురకపల్లె సమీపంలో ముందు వెళుతున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా టర్న్ తీసుకోవడంతో వెనుకనే వస్తున్న ఆటో సడెన్ బ్రేక్ వేయడంతో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ చంద్రశేఖర్‌తో పాటు షమీదా(35), హమీదా(35), మస్తానీ(40), నాదిర్‌షా(25), యూసుఫ్(5), రుకియా(13), మరియా(12), అర్షియా(5) గాయపడ్డారు.

విత్తన ఎంపికే కీలకం

- విత్తన కొనుగోలులో సరైన జాగ్రత్తలు పాటించాలి
- నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు
- పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రం



విత్తనవద్ద బస్తాలు



ఇలా మొలకెత్తాలి

కడప అగ్రికల్చర్ : పంటల సాగులో విత్తన ఎంపిక అత్యంత కీలకం. ఇది పంటల దశ, దిశ మార్చడంతో పాటు మంచి దిగుబడులకు దోహదం చేస్తోంది. అలాగే మంచి విత్తన ఎంపిక జరిగితేనే చీడపీడలను తట్టుకుని నాణ్యమైన దిగుబడిని ఇచ్చే అవకాశం కూడా ఉంటుంది. కనుక రైతులు విత్తన ఎంపిక, కొనుగోలులో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకుని అటు వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాల్సి అవసరం ఉంది. ఎందుకంటే విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే పంట సాగు మొదలుకుని దిగుబడి వరకు పెట్టిన పెట్టుబడి ఖర్చుతో రైతుల కష్టం నేలపాలు అవుతుంది. దీంతో రైతన్నలు ఆర్థికంగా చితికిపోతారు. పంటలు సాగుచేసే ముందు విత్తన ఎంపిక తదితర విషయాల్లో రైతులు కచ్చితంగా వ్యవసాయ, శాస్త్రవేత్తల సలహాలను పాటించాల్సి ఉంది.

ప్రారంభమైన ఖరీఫ్ సీజన్..

ఏడాది ముందస్తు రుతుపవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది. నదీ పరివాహక ప్రాంతాలతో పాటు వర్షాధారిత ప్రాంతాల్లో కూడా అక్కడక్కడా వేరుశనగను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు ఎక్కడపడితే అక్కడ వరి, వేరుశనగ, జొన్నలు, సజ్జలు, మినుములు, మొక్కజొన్న వంటి విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. ఇలా కొనుగోలు చేసే రైతులు స్థానిక వ్యవసాయ అధికారులు సర్టిఫైడ్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. అలాగే షాపు యజమాని లైసెన్సు ఉందా లేదా అని తెలుసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు కచ్చితంగా బిల్లులు కూడా అడిగి తీసుకోవాలి. తీసుకున్న విత్తన బిల్లులను పంట దిగుబడి చేతికి వచ్చే వరకు భద్రంగా దాచుకోవాలి. లేకుంటే విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే దిగుబడులు తగ్గి రైతన్నలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిణామాలను మనం పలు చోట్ల చూస్తునే ఉన్నాం. ఈ నేపథ్యంలో వరితోపాటు ఇతర విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విత్తనమే దిగుబడులను నిర్ణయిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చే యాలి.
- విత్తనాల కొనుగోలు సమయంలో డీలర్ల వద్ద తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలి.
- బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, విత్తనరకం, గడువుతేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- ఎక్కడ కూడా లూజు విత్తనాలు, గడువు దాటిన విత్తనాలను ఎలాంటి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదు.
- కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్ల నుంచి సంచిపైన సీల్ ఉందా, లేదా అని ముఖ్యంగా చెక్ చేసుకోవాలి.
- రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు విక్రయదారులు ఇచ్చే కరపత్రాలను తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలు పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి.
- విత్తనం కొనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి.
- మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

మొలక శాతం పరీక్షించాలి...



రైతులు ఎవరైనా బయట డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితుల్లో లైసెన్సులు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాల మొలకశాతం చెక్ చేసుకోవాలి. మొలకశాతం తక్కువగా ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దు. మొలకశాతం బాగుంటేనే విత్తనాలను కొనుగోలు చేసుకోవాలి.

– డాక్టర్ వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, కడప

ప్రాణం తీసిన ఈత సరదా

పెన్నానదిలో దిగి తండ్రీ తనయుల దుర్మరణం



మృతి చెందిన మనోహర్, డియోల్

జమ్మలమడుగు : సరదాగా ఈత కొట్టేందుకు పెన్నా నదిలోని నీటిలోకి దిగిన తండ్రీ కొడుకులు దుర్మరణం చెందిన సంఘటన శనివారం జమ్మలమడుగు మండలంలో జరిగింది. వివరాలు ఇలా..తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుక చెందిన మనోహర్ (38), అతని కుమారుడు డియోల్ (17) పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన సోదరి ప్రమీలా రాణి ఇంటికి వచ్చారు. శనివారం పర్యాటక కేంద్రమైన గండికోటను సందర్శించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలోని పెన్నానదిలో నీటిని చూసి ఈత కొట్టేందుకు దిగారు. బ్రిడ్జి సమీపంలో గుంత ఉన్న విషయం వారికి తెలియదు. తొలుత మనోహర్ నీళ్లలోకి దిగగానే అక్కడ పెద్ద గుంత ఉండటంతో అందులో పడిపోయాడు. గమనించిన కుమారుడు డియోల్ తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించి అతను కూడా అదే గుంతలో కూరుకుపోయి గల్లంతయ్యారు. తమ కళ్లెదుటే తండ్రీ కొడుకులు నీళ్లలో గల్లంతు కావడంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో తండ్రి, కుమారుడి మృతదేహాలను బయటికి తీశారు. ఇద్దరి మృతదేహాలను చూసిన బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వడం వల్లే మరణాలు

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : అధికారుల నిర్లక్ష్యంతో పెన్నానదిలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. దీంతో పెన్నాలో ఎక్కడ ఎంత లోతు ఉందో తెలియక నీటిలోనికి దిగిన వారు ప్రాణాలు కోల్పోతున్నారు.. అని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. పెన్నా నదిలో ఈతకు దిగి మృతి చెందిన వారి కుటుంబీకులను శనివారం రాత్రి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పెన్నానదిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిగాయన్నారు. ఇరవై అడుగుల లోతు వరకు కూడా ఇసుకను తవ్వేశారన్నారు. ప్రస్తుతం పెన్నానదిలో నీరు వచ్చి చేరిందని, ఎక్కడ ఎంత లోతు ఉందో ఎవరికి తెలియని పరిస్థితి ఉందన్నారు. పెన్నానది బ్రిడ్జి సమీపంలోనే గతంలో చాలా మంది మరణించారని గుర్తుచేశారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్కడ ప్రమాదానికి సంబంధించిన సూచిక బోర్డులు కూడా పెట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు పెన్నానది ప్రాంతంలో ఎక్కడెక్కడ ఎంత లోతు గుంతలు ఉన్నాయో గుర్తించి అక్కడ ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాలు, వామపక్షాల నాయకులు

మదనపల్లె రూరల్ : కేంద్ర ప్రభుత్వం విధ్వంసకరంగా సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని ప్రజాసంఘాలు, వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం.శివప్రసాద్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు, ఏపీసీఎల్సీ నాయకుడు నాగేశ్వరరావు, న్యాయవాది సోమశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆపరేషన్ కగార్‌తో ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ గ్రామాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారన్నారు. భారతదేశంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తారమైన ఖనిజ సంపద, జల వనరులు, ప్రకృతి వనరులు ఉన్నాయని, వాటన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. అటవీ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలను వెళ్లగొట్టడానికి నిశ్చయించుకున్న కేంద్రం, మావోయిస్టులను సాకుగా చూపి ఆపరేషన్ కగార్‌ను మొదలుపెట్టిందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పజెప్పకుండా అతి కిరాతకంగా వ్యవహరిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 25పై దాడిచేస్తోందని, వ్యక్తి స్వేచ్ఛను హరిస్తోందని ధ్వజమెత్తారు. ఈనెల 12న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆపరేషన్ కగార్‌ను ఆపాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణప్ప, మురళీ, వీసీకే, మాలమహానాడు, బహుజనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి



నచ్చుకూరి లక్ష్మయ్య మృతదేహం

గాలివీడు : గోరాన్ చెరువు గ్రామానికి చెందిన నచ్చుకూరి లక్ష్మయ్య(59) అనారోగ్యం కారణంగా విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రామకృష్ణ కథనం మేరకు గోరాన్ చెరువు గ్రామం బండివాండ్ల పల్లి ఎస్టీ కాలనీకి చెందిన నచ్చుకూరి పాపన్న కుమారుడు లక్ష్మయ్యకు పదేపదే మూర్ఛ వ్యాధి వస్తుండటంతో మనస్తాపం చెందేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది జూన్ 1 వ తేదీ పెన్షన్ డబ్బులు తీసుకుని సాయంత్రం పొలం దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు సిఫార్సు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చేనేత కార్మికుడిని నిర్బంధించి దాడి



దాడిలో గాయపడిన అరవింద్

మదనపల్లె రూరల్ : నగదు విషయమై చేనేత కార్మికుడిని నిర్బంధించి దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు.. కురబలకోట మండలం చింతమాకులపల్లెకు చెందిన ఆంజనేయులు కుమారుడు అరవింద్(35) మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేఅవుట్‌లో చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. స్థానికుడైన ఫైనాన్షియర్ శ్రీరామప్రసాద్ వద్ద రూ.10వేలు వారపుకంతుల లెక్కన చెల్లించేలా అప్పు తీసుకున్నాడు. అందులో వారానికి వెయ్యి చొప్పున ఆరు వారాలు చెల్లించాడు. మరో నాలుగువేలు బాకీ పడ్డాడు. ఆ డబ్బులు చెల్లించకపోగా, శుక్రవారం మద్యం తాగి స్థానికులైన రెడ్డి, శివల ఎదుట అప్పు విషయమై మాట్లాడుతూ..శ్రీరామప్రసాద్ తనకు అప్పు ఉన్నాడంటూ చెప్పాడు. ఈ విషయం రెడ్డి, శివలు శ్రీరామప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శ్రీరామప్రసాద్ అక్కడకు వచ్చి రెడ్డి, శివల సహాయంతో అరవింద్‌ను వాహనంలో రామిరెడ్డి లేఔట్‌కు తీసుకెళ్లి ఓ గదిలో నిర్బంధించి బెల్ట్, కర్రలతో చితకబాదారు. అర్ధరాత్రి తర్వాత విడిచిపెట్టారు. బాధితుడు శనివారం ఉదయం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి మీడియాకు వివరాలు తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మదనపల్లె రూరల్ : అతిగా మద్యం తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బసినికొండ పంచాయతీ, పుంగనూరు రోడ్డు ఆంజనేయస్వామి గుడి వద్ద ఓ వ్యక్తి అతిగా మద్యం సేవించి అరుగుపై పడుకుని ఉండి అలాగే మృతి చెందాడు. అతను స్థానికంగా గుజిరీ, ప్లాస్టిక్ సామానులు ఏరుకుని విక్రయించి వచ్చిన సొమ్ముతో మద్యం తాగుతూ స్థానికంగానే ఉండేవాడు. అయితే శుక్రవారం ఉదయం నుంచే మద్యం తాగుతూ స్థానికులకు కనిపించాడు. అనంతరం ఆంజనేయస్వామి గుడి పక్కనే ఉన్న అరుగుపై పడుకుని రాత్రి అరుగు నుంచి కిందకు జారిపడిపోవడంతో స్థానికులు గుర్తించి పరిశీలించారు. మృతి చెందినట్లు నిర్ధారించుకుని తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు, అతడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తాలూకా సీఐ ఫోన్ నెంబర్.9440796742, ఎస్‌ఐ 9440796743 కు తెలపాలన్నారు.

అదృశ్యమైన వృద్ధుడి ఆచూకీ లభ్యం



తండ్రితో మాట్లాడుతున్న కుమారుడు మాధవరం రఘురాం

రాయచోటి టౌన్ : మతి స్థిమితం కోల్పోయిన ఓ వృద్ధుడు ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం కుమారుడు, మనవడు గాలించి ఎట్టకేలకు శనివారం గుర్తించి ఇంటికి తీసుకెళ్లారు. వివరాలు ఇలా..

రామాపురం మండల కేంద్రానికి చెందిన మాధవరం తిమ్మయ్య(75)కు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. వారందరికీ వివాహాలై స్థిరపడ్డారు. కాగా పదేళ్ల క్రితం తిమ్మయ్య భార్య మృతి చెందింది. అప్పటి నుంచి అతను మతిస్థిమితం కోల్పోయాడు. అప్పుడప్పుడు చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీ ఇంటినుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. తొలుత రాయచోటి ఆర్టీసీ బస్టాండుకు వెళ్లి అక్కడి నుంచి వీరబల్లి మండలం ఓదివీడు పంచాయతీ బెస్తపల్లెకు వెళ్లగా గ్రామస్తులు చేరదీశారు. అతని ఆచూకీ కోసం గాలిస్తున్న కుమారుడు రామచంద్ర, మనవడు రఘురాం బెస్తపల్లె గ్రామానికి చేరుకుని తిమ్మయ్యను తమ వెంట తీసుకెళ్లారు.

పెళ్లి చేయలేదని యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన గంగాధర్

కురబలకోట : తల్లిదండ్రులు పెళ్లి చేయలేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు..పెద్దమండ్యంకు చెందిన గంగాధర్ (24) మండలంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఉన్న బండమీదకాలనీలో ఉన్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. పెళ్లి చేయాలని తల్లిదండ్రులను కోరాడు. ఇతనికి మూర్ఛ (ఫిట్స్) ఉంది. ఈ కారణంతో ఇప్పుడు పరిస్థితి బాగోలేదని మూర్ఛ నయం అయ్యాక చేస్తామని అంత వరకు ఓపిక పట్టాలని తల్లిదండ్రులు సర్దిచెప్పారు. దీంతో మనస్తాపం చెందిన ఇతను శుక్రవారం రాత్రి ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి



గాయపడ్డ సుదర్శన్‌రెడ్డి

పుల్లంపేట : పుల్లంపేట మండల పరిధిలోని రంగంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీసీపీ నాయకుడు, అనంతంపల్లి సహకార బ్యాంక్ మాజీ సింగిల్ విండో ప్రెసిడెంటు సుదర్శన్‌రెడ్డిపై శనివారం రాత్రి పుల్లంపేట పోలీస్‌స్టేషన్ కూతవేటు దూరంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పుల్లంపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు తదితరులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై కూటమి నాయకులు దాడి చేయడం పరిపాటిగా మారింది. ప్రశాంతంగా ఉన్న పుల్లంపేట మండలంలో కూటమి నాయకులు దాడి చేయడంతో సామాన్యులు భయాందోళనకు గురవుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పుల్లంపేట ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగర శివార్లలోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేసి ప్రమాదాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయం సిబ్బందితో మాట్లాడి మీకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఉత్సాహంగా ఏసీఏ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ



విన్నర్‌గా నిలిచి కప్‌ను అందుకున్న అనంతపురం జట్టు



5 వికెట్లు తీసుకున్న చిత్తూరు బౌలర్ రెడ్డి ప్రకాష్



86 పరుగులతో నాటౌట్‌గా చిత్తూరు బ్యాట్స్‌మెన్ లోహిత్ లక్ష్మీనారాయణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ – 23 వన్డే క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై చిత్తూరు జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 44.4 ఓవర్లలో 208 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి సూర్య తేజ 80, యజ్ఞేశ్వర్ 51 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని రెడ్డి ప్రకాష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. తేజ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 209 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 23.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 86 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తేజ రెడ్డి 62 పరుగులు చేశాడు.

వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో..

వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కడప జట్టుపై 6 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 35.2 ఓవర్లలో 151 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఎస్ఎండీ అయాబ్ 52, వాసు దేవరాజు 36 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దీపక్ 4, కామిల్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 152 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 22.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 78 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఆదిల్ హుస్సేన్ 3 వికెట్లు తీసుకున్నాడు.